ప్రజాశక్తి
సోమవారం 6 మార్చి 2023
5
అల్లూరి సీతారామరాజు

దిశ యాప్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-అరకులోయరూరల్:మండలంలోని కొత్త బల్లుగుడ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలో సిఐ జీడి బాబు, ఎస్ఐ సంతోష్ ఆధ్వర్యంలో ఆదివారం మీ కోసం మీ పోలీసు కార్యక్రమంలో భాగంగా దిశా యాప్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సిఐ మాట్లాడుతూ దిశ యాప్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు.పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించా లన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం, సిబ్బంది, కానిస్టేబుల్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ జీడిబాబు

నూతన విద్యా విధానం పేరుతో పాఠశాలల విలీనం సరికాదు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:రాష్ట్రంలో నూతన విద్యా విధానం పేరుతో పాఠశాలలు విలీనం చేసి గిరిజన విద్యార్థులను విద్య నుండి దూరం చేసే ప్రయత్నం సరికాదని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం నూతన విద్యా సంస్కరణపై సదస్సు తాంగుల చిట్టిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సుకు పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు .వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా నూతన విద్యా విధానం పేరుతో తక్కువ మంది ఉన్నారనే సాకుతో పాఠశాలలు మూసివేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఉద్యోగు లకు, అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు, పింఛనుదారులకు ప్రభుత్వం చేసిన మేలేమిటని ప్రశ్నించారు. ఉద్యోగులకు పీఆర్సీ అమలు, సకాలంలో డీఏలు చెల్లింపు హామీ ఏమైందని ప్రశ్నించారు. విద్యా వ్యవస్థ సక్రమంగా లేక పోవడంతో విద్యార్థులు ప్రభుత్వ బడుల నుంచి ప్రైవేటుకు తరలి పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఉపాధ్యాయులపై జీవో నెం 1 తీసుకొచ్చి నిర్బంధ ప్రయోగాలకు పూనుకుని బ్రిటీష్ పాలనను తలపిస్తోందని విమర్శించారు. భవిష్యత్‌లో ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రతిఘటన తీవ్ర తరమవుతుందని స్పష్టం చేశారు. 11వ పీఆర్సీ సంబంధించిన ఎరియర్లు, 30 ఏళ్ల తరువాత చెల్లిస్తామని చెప్పడం.. మోసం కాదా అని ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన మాట ఏమైందన్నారు.ఓపీఎస్ మాట మరిచిపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల కోసం పోరాడుతున్న వారిని హౌస్ అరెస్టులు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం అఖిలభారత నాయకులు తిరుపతిరావు, గిరిజన ఉద్యోగం సంఘం నాయకులు చిన్నంనాయుడు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి మహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కె.రఘునాథ్, ఎస్ రాంబాబు, ఎల్.నారాయణ, బాలకృష్ణ, టి.విజయ్, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

సదస్సుకు హాజరైన ఉద్యోగులు, సంఘాల నేతలు

మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

ఏజెన్సీ అడవుల్లో కార్చిచ్చు

కొయ్యూరు అడవుల్లో వ్యాపిస్తున్న మంటలు

ప్రజాశక్తి - కొయ్యూరు : అల్లూరి ఏజెన్సీలో ఉన్న అడవుల్లో కార్చిచ్చు రగులుతోంది. పచ్చగా ఉండే అడవులు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. వేసవి కాలం మొదలవ్వక ముందే ఎండల తీవ్రత పెరగడంతోపాటు ప్రస్తుతం శిశిర రుతువులో ఆకులన్నీ చెట్లు రాల్చే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో అడవుల్లో రాలిన చెట్ల ఆకులకు ఆకతాయిలు నిప్పు రాజేయడంతో అవికాస్తా వ్యాపించి, కార్చిచ్చుగా మారి పచ్చని అడవులను దహించివేస్తున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.ఆదివారం మండలంలోని చింతాలమ్మ ఘాట్ రోడ్డులో ఇలాగే కొండల్లో మంటలు వ్యాపించి దహించి వేశాయి. పచ్చని అడవులు అగ్నికి ఆహుతవుతున్నాయి. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి, అడవుల్లో దావానలంగా వ్యాపిస్తున్న మంటలను అదుపు చేయాలని కోరుతున్నారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

-వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ-ప్రజాశక్తితో టిడబ్ల్యు డిడి కొండలరావు

పదో తరగతి పరీక్షలపై ప్రత్యేక దృష్టి పెట్టామని అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎ టిడబ్ల్యు డిడి ఐ.కొండలరావు తెలిపారు. 100శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికతో ముందుకెళ్తున్నామని, ఉపాధ్యాయులతో తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 11 మండలాల్లోని జిటిడబ్ల్యు ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలపై ప్రణాళికలు, సన్నద్ధతపై ప్రజాశక్తితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రజాశక్తి-పాడేరు టౌన్:

పరీక్షా కేంద్రాల ఏర్పాటు

పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 18 వరకు జరగనున్నాయి. వీటి నిర్వహణకు పాడేరు ఏజెన్సీ 11 మండలాల వ్యాప్తంగా 39 కేంద్రాలు ఎంపిక చేసాం. 106 జిటిడబ్ల్యు ఆశ్రమ పాఠశాలల్లోని 2,225 బాలురు, 2,788 బాలికలు మొత్తం 5,013 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు.

వెనుకబడిన వారికి ప్రత్యేకత శిక్షణ

సమ్మేటివ్, ఫార్మేటివ్ పరీక్షల ఫలితాల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి తర్ఫీదు ఇస్తున్నాం. ఇప్పటికే ఉపాధ్యాయులతో సబ్జెక్టు వారీగా సమీక్షించాం. ఏ సబ్జెక్టులో విద్యార్థి వెనుకబడి ఉన్నాడో గుర్తించి, అందులో ప్రత్యేక చొరవ తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. కరోనా కారణంగా గతేడాది ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. ఈసారి మెరుగైన ఫలితాల సాధనే ధ్యేయంగా కృషి చేస్తున్నాం.

విద్యార్థులకు ఇస్తున్న మార్గదర్శకాలు

పది పరీక్షలు అంటే విద్యార్థుల్లో ఎంతో భయం ఉంటుంది. ఉత్తీర్ణత అవ్వకపోతే విద్యార్థులు మానసికంగా కుంగిపోతుంటారు. వారిలో అభయాన్ని పోగొట్టి ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని నింపేందుకు ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్నాం. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేందుకు కావాల్సిన మార్గదర్శకాలను ఇప్పటికే అమలు చేస్తున్నాం. నిపుణులు తయారు చేసిన మాదిరి ప్రశ్న పత్రాలతో సాధన చేయిస్తున్నాం.

పరీక్షలకు ఏర్పాట్ల వివరాలు

విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఎలాంటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా చూడాలని అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. మరుగుదొడ్లు, మంచినీరు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించాం.

మంచి ఉత్తీర్ణతకు చేస్తున్న కృషి

లక్ష్యాన్ని సాధించేందుకు హెచ్‌ఎంలు, సబ్జెక్టు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారు. విద్యార్థుల ప్రతిభను పదును పెట్టేలా సబ్జెక్ట్ టీచర్లు కష్టపడి చదివిస్తూ ప్రత్యేక శ్రద్ధతో మంచి మార్కులు వచ్చేలా సన్నద్ధం చేస్తున్నారు. విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా తగు జాగ్రత్తలతో బోధిస్తున్నారు. మండల స్థాయిలోను ఎటిడబ్ల్యూఒలు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

ప్రత్యేక తరగతులు, రోజు పరీక్షలు వివరాలు

పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతుల్లో విద్యార్థుల నైపుణ్యాలను మెరుగు పరుస్తున్నారు. సబ్జెక్టుల వారీగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం కూడా పరీక్షల నిర్వహిస్తున్నారు.



ఇంటర్ పరీక్షా కేంద్రం మంజూరుపై హర్షం

ప్రజాశక్తి -సీలేరు: జికె.వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌పరీక్షా కేంద్రం మంజూరు కావడంపై స్థానిక ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఇంటర్ పరీక్ష కేంద్రం మంజూరుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి కతజ్ఞతలు తెలిపారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో సీలేరు వచ్చిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పర్యటించినపుడు ఇంటర్ పరీక్ష కేంద్రం ఏర్పాటుపై విన్నవించామన్నారు. అలాగే గుమ్మరేవుల పంచాయతీ సచివాలయం ప్రారంభానికి వచ్చిన జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఇంటర్ పరీక్ష కేంద్రం ఏర్పాటుపై విన్నవించామన్నారు. సీలేరు జూనియర్ కాలేజీలో ఇంటర్ పరీక్ష కేంద్రం ఏర్పాటుకు స్థానికుల అభ్యర్థన మేరకు ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ ప్రత్యేకశ్రద్ధ కనబరిచి ఇంటర్‌బోర్డు కమిషనర్‌కు నివేదించి, తప్పక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారన్నారు. వీరందరితోపాటు స్థానిక కాలేజీ ప్రిన్సిపల్ వినోద్‌బాబు కూడా పరీక్ష కేంద్రం ఏర్పాటు ఆవశ్యకతను పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదించి, తన వంతు బాధ్యతను నిర్వర్తించారన్నారు ఇలా అందరి కృషితో ఇంటర్ పరీక్ష కేంద్రం ఏర్పాటులో విద్యార్థులకు వ్యయప్రయాసలు తగ్గుతాయన్నారు. గడచిన నాలుగేళ్లగా దాదాపు 50కిలోమీటర్ల దూరంలో ఉన్న జికె.వీధి పరీక్ష కేంద్రానికి వెళ్లి పరీక్షలకు రాయాల్సిన కష్టాలనకు విముక్తి లభించిందన్నారు. ఈ సందర్భంగా వారందరికీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఈ ప్రాంతీయుల తరపున ధన్యవాదాలు తెలిపారు.

బోసిపోయిన వారపు సంత

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో ఆదివారం సంత వెలవెలబోయింది. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు గ్రామాల నుంచి గిరిజనులు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో కళతప్పింది. సీలేరు పరిసర గ్రామాలతో పాటు ఎఒబి ప్రాంతంలోని గ్రామాల నుంచి గిరిజనులు ప్రతివారం సీలేరు సంతకు తాము పండించి గిరిజన ఉత్పత్తులను తీసుకొచ్చి విక్రయించడంతోపాటు, తమకు వారానికి సరిపడా నిత్యావసరాలను కొనుక్కుని వెళుతుంటారు. అయితే రానురాను వారపుసంతలపై గిరిజనులకు ఆసక్తి తగ్గుతోంది. ప్రస్తుతం ముదురుతున్న ఎండల్లో వారపుసంతకు ఇక్కట్లు పడుతూ వెళ్లడం ఒకటైతే, పలు గ్రామాల్లో గిరిజనులే చిన్నచిన్న దుకాణాలను ఏర్పాటు చేసుకుని, గ్రామస్తులకు అవసరమైన వస్తువులును గ్రామాల్లోనే విక్రయిస్తున్నారు. దీంతపాటు సంచార వ్యాపారులు బైక్‌లపై మారుమూల గ్రామాలకు సైతం అవసరమైన అన్ని సరుకులతో వెళ్లి, ఆయా గ్రామాల్లోని గిరిజనులకు విక్రయిస్తుండడంతో ఇక వారపుసంతకు వచ్చే అవసరం లేకుండా పోతోంది. కిరాణా, ప్యాన్సీ సామాన్లు, దుస్తులు, ఎలక్ట్రికల్ వస్తువులు ఇలా అన్ని రకాల వస్తువులను సంచార వ్యాపారులు గిరిజనుల చెంతకు చేరుస్తున్నారు. అంతేకాక మారుమూల గ్రామాల్లోని గిరిజనులకు అవసరాలను ముందుగానే ఇండెంట్‌గా తీసుకుని, వారికి అందజేసే చర్యలు చేపడుతున్నారు మరోవైపు మరి కొంతమంది గిరిజనులు ఆంధ్రఒరిస్సా చిత్రకొండ వారపు సంతకు వెళ్లిపోవడంతో సీలేరు వారపు సంతపై ప్రభావం చూపింది. దీంతో వర్తకులు వ్యాపారాలు సాగక నిరాశ గురవుతున్నారు. జీకే వీధి మండలం దుప్పలవాడ పంచాయతీ పరిధిలో మాలీలు పండించిన కూరగాయలు సీలేరు వారపు సంతకు తెచ్చి, సాయంత్రం 6 గంటల వరకు అవి అమ్ముడుపోకపోవడంతో నానాఅగచాట్లు పడ్డారు.

కొనుగోలుదారుల లేక వెలవెలబోయిన సంత

కిలో మిరియాల ధర రూ.500

- దళారులకు తక్కువకు అమ్మి మోసపోవద్దు
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మిరియాలకు ధర బాగా పెరిగిందని, టోకు, రిటైల్ మార్కెట్‌లో కూడా అధిక డిమాండ్‌తో పాటు అధిక ధరలకు అమ్మకాలు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు మిరియాలును కిలో రూ.500లకు తక్కువ అమ్మ వద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. మధ్యవర్తులను, దళారులను నమ్మి మోసపోవద్దని వ్యాపారులతో నేరుగా చర్చించి రూ.500 లకు తక్కువ కాకుండా అమ్మకాలు జరపాలని సూచించారు. అంతర్జాతీయంగా కూడా డిమాండ్ పెరిగిందని, ఎన్‌సిబిఎక్స్ మార్కెట్ లో కూడా డిమాండ్ ఉన్న విషయం రైతులు గుర్తించి కిలో రూ.500 రూపాయలు పైబడి అమ్మాలని తెలిపారు. సంతలు, బహిరంగ ప్రదేశాల్లో, అమ్మకాలు చేసే రైతులు ఈ విషయం గుర్తించాలని కోరారు. గతంలో ఇదే మిరియాలు కిలో రూ.400 మించి అమ్మలేక రైతులు కొంతమేర నష్టపోయే పరిస్థితి నెలకొందన్నారు ప్రస్తుత డిమాండ్, ధర పెరగడంతో వారికి కొంత ఉపశమనం కలుగుతుందని కలెక్టర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ అవకాశాన్ని రైతులు

కుటుంబీకులతో ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులు

నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- జి.మడుగుల: కంఠవరం జలపాత వద్ద మత్స్య మడుగులమ్మ నాయి బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం సమావేశం ఆదివారం జరిగింది. మండల మత్స్యమడుగులమ్మ నాయి బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం నూతన అధ్యక్షుడిగా కాతా మాధవరావు, కోశాధికారిగా బైలుపూడి రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం బలోపేతం చేయడానికి, సభ్యుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని అధ్యక్షుడు మాధవరావు అన్నారు. ఈ సమావేశంలో మండలంలో పలు ప్రాంతాల నుండి నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు.

అనారోగ్యంలో విఆర్ఒ మృతి

ప్రజాశక్తి - పెదబయలు:మండలంలోని పరేడ పంచాయతీ సచివాలయం విఆర్ఓ బోండా రాధాకృష్ణ (25) క్షయ వ్యాధితో బాధపడుతు కెజిహెచ్‌లో. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. గత కొంతకాలంగా క్షయ వ్యాధితో. చికిత్స పొందుతున్నాడు. క్షయతో పాటు పచ్చకామెర్లు సోకడంతో పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు కెజిహెచ్‌కు తరలించారు.సీపీఎం నాయకుడు . బోండా సన్నిబాబు, సర్పంచ్ మాదవరావు, ఎంపిటీసీ బోంజుబాబు, మాజీ ఎంపీపీ వి.కొండయ్య, పంచాయతీ ఉపాధ్యక్షుడు గంగాధరం, యూటిఎఫ్ అధ్యక్షుడు జె.సత్యనారాయణ పరేడ సర్పంచ్ చెండా. రవి కుమార్ కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఇదిలా ఉండగా గతనెల జనవరి 29న ఇదే సచివాలయం ఉద్యోగి సర్వేయర్ మండి జవహర్ లాల్ అనారోగ్యంతో కెజిహెచ్ లో మృతి చెందారు. దీంతో ఒకే సచివాలయంలో ఇద్దరు ఉద్యోగులు రెండు నెలల వ్యవధిలో మృతి చెందారు.

నేలజర్తలో మధ్యాహ్న భోజనం పునరుద్ధరణ

- బిల్లులు, జీతాల చెల్లింపుల్లో తేడా లేదు
- అవగాహనా లోపంతోనే ఆందోళన
- 'ప్రజాశక్తి' కథనానికి ఎంఇఒ స్పందన

ప్రజాశక్తి -సీలేరు: జీకే.వీధి మండలం గుమ్మరేవుల పంచాయతీ నేలజర్త ఎంపిపి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పునరుద్ధరించారు. మధ్యాహ్న భోజనం పథకం బిల్లులు, వర్కర్‌కు కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో పాఠశాలలో మిడ్డేమీల్స్ నిలిపేయడంతోపాటు వంటగదికి తాళం వేసిన ఘటన చోటుచేసుకుంది. దీనిపై ప్రజాశక్తిలో నేలజర్తలో ఆగిన మధ్యాహ్నభోజనం శీర్షికతో వెలుగులోకి తేగా ఎంఇఒ చంద్రశేఖర్ స్పందించి, పాఠశాలను సందర్శించారు. స్కూల్ కమిటీ చైర్మన్ మార్కు రాజు, గ్రామస్తులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. మధ్యాహ్న భోజన కార్యకర్త పూజారి పార్వతి, కిముడు అమ్మాజీలతో చర్చించారు. ఈసందర్భంగా మధ్యాహ్నభోజన బిల్లులతోపాటు వర్కర్లజీతాలు వారి ఖాతాల్లో జమ అయ్యాయని, అయితే వారు బ్యాంకు వెళ్లి తమ ఖాతా పుస్తకాలను అప్‌డేట్ చేసుకోకపోవడంతో బిల్లులు అందలేదని నిర్ధారణకు వచ్చి ఇలా భోజనాన్ని నిలిపేశారన్నారు. ఏదైనా సమస్య వస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లి, చర్చించి తగు చర్యలు తీసుకోవాలే తప్ప, ఇలా విద్యార్థులకు ఇబ్బందులకు గురిచేస్తూ మధ్యాహ్న భోజనాన్ని నిలిపేయడం, వంటగదికితాళాలు వేయడం వంటి చర్యలు మంచిదికాదని హితవు పలికారు. ఇదే విషయాన్ని స్కూల్ కమిటీ ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులకు వివరించారు. సమస్య తన దృష్టికి తెస్తే పరిష్కరించేవాడినని, ఇంత రాద్ధాంతం జరిగేదని కాదన్నారు. వెంటనే విద్యార్థులకు మధ్యాహ్న భోజానాన్ని వండి వడ్డించాలని సూచించారు. ఎంఇఒ దగ్గరుండి విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు.

దగ్గరుండి మధ్యాహ్న భోజనాన్ని పెట్టిస్తున్న ఎంఇఒ చంద్రశేఖర్

లోదొడ్డిలో జియో సెల్‌టవర్

నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ రామారావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మారుమూల లోదొడ్డి గ్రామంలో జియో సెల్ టవర్ పనులను ఎట్టకేలకు ఆదివారం ప్రారంభించారు. సెల్ టవర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, స్థానిక సర్పంచ్ లోతా రామారావు మాట్లాడుతూ, మారుమూల లోదొడ్డి పంచాయతీలో, పూదేడు, కె. పూదేడు, కేశవరం, పాకవెల్తి గ్రామాలు న్నాయని, అయితే సెల్ సిగ్నల్ అందుబాటులో లేకపోవడంతో బాహ్యప్రపంచానికి దూరంగా ఉండే పరిస్థితి నెలకొందన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనానికి సమాచారం అందిద్దామన్నా ఫోను అందుబాటులో లేని పరిస్థితి ఉందన్నారు. దీనికి ఇటీవల కాలంలో ప్రభుత్వ పథకాలకు సంబందించి ప్రతిదానికి ఆన్‌లైన్, బయోమెట్రిక్, ఇకెవైసి తప్పనిసరి పరిస్థితుల్లో వీరు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కాదన్నారు. సచివాలయ వ్యవస్థ వచ్చాక ఇకెవైసి, ఇతర సేవలకు సిగ్నల్స్ కోసం కొండలెక్కాల్సిన పరిస్థితి ఉందని, లేదంటే నెట్‌వర్క్ కోసం 15కిలోమీటర్లు వెళ్లక తప్పడం లేదన్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించిన నేపథ్యంలో వారు స్పందించి, లోదొడ్డి జియోటవర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో జియో సెల్‌టవర్ నిర్మాణం పూర్తయి, సేవలు ఒదుబాటులోకి వస్తే గిరిజనుల సమస్యలు తొలగినట్టేనన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుట్టరీ రాజుబాబు, వార్డు మెంబర్లు జర్త రాజుబాబు, వెలుసూరి సుజాత, పొత్తూరు చిన్నమ్మి, పొత్తూరు సత్యనారాయణ, కొర్రపు బాలమ్మ, సిహెచ్ వెంకటరెడ్డి, పి రాజుబాబు,కె.సత్యనారాయణ, బి.కల్యాణ్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న వైద్యనిపుణులు

ఆరోగ్య మిత్రలకు శిక్షణ

ప్రజాశక్తి -చింతూరు : ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో చింతూరులోని నిమ్మలగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆరోగ్యమిత్ర శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. శిక్షణలో పాల్గొన్న డాక్టర్ పిజి గంగాధర్‌ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే 80శాతం వరకు వ్యాధులు రాకుండా అరికట్టవచ్చని, ఇదే ఆరోగ్య విద్య అన్నారు. ఆరోగ్యాన్ని పరిరక్షించాలంటే దురలవాట్లను దూరం చేసి, పనిలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం, బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించడం ఎంతో అవసరమన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రధమ చికిత్స, స్వస్థత, జీవనశైలి గృహవైద్యం సంబంధించిన కిట్లను అందజేశారు. శిక్షణలో వైద్యులు పి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.సౌజన్య, డాక్టర్ పి విజయలక్ష్మి , డాక్టర్ ఎ.రాధ,. డాక్టర్ ఎవిఎల్ నారాయణ పాల్గొన్నారు.

సమస్యలపై సచివాలయ ఉద్యోగుల వినతి

వెంకటరామిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రంపచోడవరం ఏజెన్సీలోని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎపి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కాకర్లపూడి వెంకటరామిరెడ్డికి వినతి పత్రం అందజేసినట్లు అల్లూరి జిల్లా వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి చెక్కా రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ సోముల కిషోర్ తెలిపారు, ఆదివారం విశాఖపట్నంలో జరిగిన ఎపి ఉద్యోగుల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చిన వెంకట రామిరెడ్డిని కలిసి సమస్యలను విన్నవించి, వాటి పరిష్కారానికి యూనియన్ ద్వారా ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేయాలని కోరారు.

సెల్ సిగ్నల్, ఇతర సాంకేతిక సమస్యలతో బయోమెట్రిక్, ఫేషియల్ రికగ్నైజేషన్ హాజరుకు నానా ఇబ్బందులు పడుతున్నందున దానికి మినహాయింపు ఇవ్వాలని, సరిగా లేనందున బయోమెట్రిక్,ఫేషియల్ హాజర్ నుండి ప్రభుత్వం మినహాయింపు ఇవ్వాలని, సచివాలయ ఉద్యోగులకు బిఎల్ఒ విధులనుంచి తొలగించాలని, గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు డిడిఒ అధికారాలు కల్పించాలని, సచివాలయ ఉద్యోగులకు నిర్దిష్టమైన ప్రమోషన్ ఛానల్ కల్పించి, ఎరియర్స్, ఇంక్రిమెంట్లు ఇచ్చి బదిలీలు చేయాలని, జిమ్‌ఎస్‌కెలను నైట్ డ్యూటీ నుంచి మినహాయించాలని, క్షేత్రస్థాయిలో సచివాలయ ఉద్యోగులు రాజకీయ ఒత్తిళ్ళు, వేధింపులను అరికట్టే చర్యలు చేపట్టాలని, కారుణ్య నియామకాలు, రెండేళ్లు పూర్తయిన సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లేర్ వంటి చర్యలు చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ పొట్టబోయిన శ్రీనివాస్ దొర, సింహాద్రి, రామరాజు గంగవరం, చింతూరు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నిలిచిపోయిన భవనం పనులు

నత్తనడకన ఏకలవ్య పాఠశాల భవనం పనులు

- పరాయి పంచనే తరగతుల నిర్వహణ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మించడంలో జాప్యం జరుగుతోంది. సుమారు మూడేళ్ళ గడుస్తున్నా భవనాలు అసంపూర్తిగానే ఉన్నాయి. ఆ పాఠశాలలో చదివే విద్యార్థులు వేరే మండలంలో పరాయి పంచన చదువుకునే పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు భవన నిర్మాణాలను పలుమార్లు సందర్శించి వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశాలిస్తున్నప్పటికీ నిర్మించడంలో జాప్యం జరుగుతూనే ఉంది. దీంతో ఆ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఇబ్బందులు తప్పలేదు.

ప్రభుత్వం సుమారు రూ.12 కోట్ల నిధులను భవన నిర్మాణాలకు మంజూరు చేసింది. మండల కేంద్రంలో రైతులు స్వచ్ఛందంగా ఇచ్చిన సుమారు 13 ఎకరాల్లో గత 2019లో భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అప్పటినుంచి ఇప్పటి వరకు సుమారు మూడేళ్ళ పైగా గడుస్తున్నా భవన నిర్మాణ పనులు నత్తనడకగానే సాగుతున్నాయి. దీంతో ఆ పాఠశాలలో చదివే విద్యార్థులకు అరకులోయ మండలంలోని వైటీసీలో తరగతుల నిర్వహణను అధికారులు కొనసాగిస్తున్నారు. అధికారులు స్పందించి ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సర్టిఫికెట్లతో గ్రాడ్యుయేట్ శిక్షణ పొందిన మహిళలు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని చైతన్య స్రవంతి సంస్థ డైరెక్టర్ మాలిని సూచించారు. చైతన్య స్రవంతి సంస్థ ఆధ్వర్యంలో మినుములూరు కార్యాలయ ఆవరణలో ఆదివారం మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. దీంతో, జీవన ప్రమాణాలు పెరగడంతో పాటు విలువలు పెంపొందించుకోవచ్చని తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధికి తగిన సూచనలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. అనంతరం స్కిల్ డెవలప్ మెంట్ స్కీం ద్వారా గార్మెంట్ శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ లను అందజేశారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఇ ప్రతినిధులు కె.ఎల్.ఎస్. రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ అప్పికొండ శ్రీను, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ చిట్టెమ్మ, ఆర్ట్ సంస్థ ప్రసాద్, చైతన్య స్రవంతి సంస్థ ప్రతినిధులు రాజకుమార్, మాతోట మార్క్ సిఇఒ లోచలి ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

కోరెడ్ల రమాప్రభ గెలుపునకు విస్తృత ప్రచారం

పెందుర్తి రవినగర్‌లో ప్రచారం

ప్రజాశక్తి-యంత్రాంగం

పెందుర్తి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ మద్దతుగా 94వ వార్డు పరిధి రవినగర్‌లో ఐద్వా ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటువేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీచేశారు. పట్టభద్రులు ఆలోచించి ఉన్నతమైన వ్యక్తికి ప్రాధాన్యత ఇవ్వాలని ఐద్వా నాయకులు లక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో బి.రమణి, రజని. సుహాసిని, సూరీడమ్మ, ప్రదీప్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ సిఐటియు, సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యాన సింహాచలం ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును రమాప్రభకు వేయాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

గొలుగొండ: చట్టసభలలో ప్రశ్నించే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు కోరారు. ఆదివారం మండలంలోని ఎల్లవరం రాజులబాబు గుడి వద్ద సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం కామ్రేడ్ శెట్టి పైడియ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రామునాయుడు మాట్లాడుతూ, చట్టసభల్లో ప్రశ్నించే గొంతులను ఎన్నుకోవాలని కోరారు. విద్యార్థి, నిరుద్యోగ, యువజన, ఉపాధ్యాయుల ప్రజా సమస్యలపై నిరంతరంగా పోరాడే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు మేకా సత్యనారాయణ, ఏఐటీయుసి జిల్లా కార్యదర్శి ఎల్వీ.రమణ, సిపిఐ మండల కార్యదర్శి మేకా భాస్కర్ రావు, ఏఐవైఎఫ్ జి.రాధాకృష్ణ, లోకరవు అప్పలనాయుడు, ఎం.అప్పలనాయుడు, బాబులు, ఎం.బాబులు పాల్గొన్నారు.

కొత్తకోట: కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ కెవిపిఎస్, గిరిజన సంఘం ఆధ్వర్యంలో కొత్తకోట, మేడివాడ, గర్నికం, రావికమతం గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్ల్లి చిరంజీవి, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ, ఉద్యోగ, కార్మిక ఔట్సోర్సింగ్ ఉద్యోగ, ప్రజా సంఘాలు బలపరిచిన అభ్యర్థిని కోరెడ్ల రమాప్రభను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సిహెచ్ సూరిబాబు, మర్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

వారపుసంతలో ప్రజాసంఘాల ప్రచారం

కొయ్యూరు : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం మండల కేంద్రంలోని వారపుసంతలో గిరిజన సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. సంతకు వచ్చే పట్టభద్రుల ఓటర్లతోపాటు ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, ఉద్యోగులు, స్కీం వర్కర్స్‌ను కలిసి రమాప్రభకు మొదటిప్రాధాన్యత ఓటేయాలని కోరారు. ఏజెన్సీలో జిఒ 3 పునరుద్ధరణ, 1/70, అటవీ హక్కులు, ఇతరత్రా గిరిజన చట్టాలు పటిష్టంగా అమలు, కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్, ఏజెన్సీలో స్పెషల్ డిఎస్‌సి జారీ, ఇతర సమస్యలపై శాసనమండలిలో ఉత్తరాంధ్ర వాణి వినిపించాలంటే రమాప్రభ గెలుపు ఎంతో అవసరమన్నారు.

అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల చిన్నబాబు కాలనీలో పాటు పలు ప్రాంతాల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ సిఐటియు నాయకులు, కార్యకర్తలు ఆదివారం ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలంటే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆర్ శంకరరావు, భాస్కరరావు, శాస్త్రి, ఆనంద్, రమేష్, అజయ్, తరుణ్ పాల్గొన్నారు.

తుమ్మపాలలో ప్రచారం నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

కొయ్యూరు వారపుసంతలో ప్రచారం నిర్వహిస్తున్న గిరిజన సంఘం, సిఐటియు నాయకులు

బిజినెస్ కాన్‌క్లేవ్‌లో మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

పారిశ్రామికవేత్తలు సహకారం అందించాలి

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి -మధురవాడ : పారిశ్రామిక వేత్తలు, ముఖ్యంగా దేశ కార్పొరేట్ రంగం సామాజిక బాధ్యతగా సమాజానికి ఇతోధికంగా సహకారం అందించాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. విశాఖలోని ఐటి హిల్‌పై ఫ్లూయంట్ గ్రిడ్ సంస్థ ఆవరణలో ఆదివారం జరిగిన కార్పొరేట్ కనెక్షన్స్ బిజినెస్ కాన్‌క్లేవ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశం శాస్త్ర సాంకేతిక రంగాలలో గణనీయమైన ప్రగతిని సాధిస్తోందన్నారు. రానున్న కాలంలో ప్రపంచంలోనే తృతీయ బలమైన ఆర్థిక శక్తిగా ఎదగనుందని పేర్కొన్నారు. అమెరికా తరువాత స్టార్టప్‌ల సంఖ్య మన దేశంలోనే అధికంగా ఉందన్నారు. భారతీయ సమాజం మేధోపరంగా ప్రపంచంలో ఉన్నత స్థానంలో ఉందని, నూతన విద్యావిధానం అందుకు ప్రోత్సాహం కలిగించే దిశలో ప్రయాణిస్తోందని చెప్పారు. ఈ ఏడాది దేశంలో జరగనున్న జి20 సమావేశాలలో భారతదేశం పర్యావరణం, ఆర్థిక నేరగాళ్ళ అప్పగింత వంటి అంశాలతో పాటు వసుదైక కుటుంబం నినాదాన్ని ప్రపంచానికి చాటాలన్నారు.

సంపద పెంచకుండా పంచుకుంటూ పోతే అనర్థమే

సంపద పెంచుకోకుండా పంచుకుంటూపోతే అనర్థాలకు దారితీస్తుందన్నారు. అప్పులకు వడ్డీలు కట్టడంతోనే సరిపోతుందన్నారు. అవసరార్థులకు చేయి అందించాలి తప్ప భుజం ఎక్కించి మోయకూడదని పేర్కొన్నారు. సమాజంలో శాంతిని పెంపొందించాలని, వ్యాపారంలో సహితం నైతిక విలువలు పాటించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డివి.సోమయాజులు మాట్లాడుతూ, ఆర్థిక ప్రగతితో పాటు కార్పొరేట్ సామాజిక బాధ్యతతో పారిశ్రామికవేత్తలు వ్యవహరించాలన్నారు.

జగనన్న గృహ సారథుల సమావేశం

ప్రజాశక్తి - విఆర్.పురం: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళి వైసిపి విజయానికి గృహ సారథులు కృషి చేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి కోరారు. ఆదివారం రేఖపల్లిలో వైసిపి కార్యకర్తలు, గృహసారథులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించడం ద్వారా పార్టీని బలోపేతం చేసి, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు మాచర్ల గంగులు, ముత్యాల శ్రీనివాస్, సిక్కా బాలు, ఎంపిటిసి బంధం విజయలక్ష్మి, ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

మూడు రోజులుగా అంధకారం

ప్రజాశక్తి -సీలేరు: మూడు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వలసపల్లి, మునసపల్లి గిరిజన గ్రామాల్లో అంధకారం ఏర్పడింది. జీకే వీధి మండలం దుప్పిలవాడ పంచాయతీ వలసపల్లి మునసపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో సాంకేతిక సమస్యలు తలెత్తి విద్యుత్ సరఫరా గిరి గ్రామాలకు నిలిచిపోయింది. ఈ సందర్భంగా గ్రామస్తులు వంతల శివా, బలరాము మాట్లాడుతూ తమ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయి మూడు రోజులు గడుస్తున్నా ట్రాన్స్‌కో అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. అటవీ ప్రాంతంలో తాము జీవిస్తున్నామని పాములు, పురుగులు విషకీటకాలు కుడితే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తమ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని మొరపెట్టుకున్న పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి వలసపల్లి, మునసపల్లి గ్రామాలకు వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలో యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నుకొన్నట్లు జిల్లా కౌన్సిలర్ జంపరంగి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షునిగా గండేరు మాధవరావు, ఉపాధ్యక్షుడుగా జీ.బాబురావు, ప్రధాన కార్యదర్శిగా బతిరి కమలకుమరి, కోశాధికారిగా అంటిపర్తి కోటేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్స్‌గా జంపరంగి సత్యనారాయణ, శ్రీనుబాబు, సిపిఎస్ కమిటీ కన్వీనర్‌లుగా కొర్ర రామశేఖర్, కొర్ర వెంకటేష్, మరో పదిమంది సభ్యులుగా ఎన్నికయ్యారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన సభ్యులు

సంగీత విభావరిలో పాల్గొన్న కళాకారులు

ఆకట్టుకున్న సంగీత విభావరి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్వరమాలిక, నటరత్న కల్చరల్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో ఆదివారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో తలపెట్టిన సినీ సంగీత విభావరి ఉర్రూతలూగించింది. కార్యక్రమాన్ని విశ్రాంత అదనపు ఉప పోలీస్ కమిషనర్ మహమ్మద్ ఖాన్, సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా గాయకులు భయ్యా శ్రీనివాస్, ఆంజనేయ రెడ్డి, హేమంత్ అనేక హుషారైన గీతాలు ఆలపించి ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గంగాధర్, వెంకటేష్, గాయనీమణులు పేరి గీత, రమణి, శైలజ, రేణుక, లావణ్య, లయ తదితరులు తమ గళ మాధుర్యంతో అలరించారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా రాధారాణి వ్యవహరించారు.

ఏర్పాట్లును పరిశీలిస్తున్న శ్రీనివాసమూర్తి

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - సీతమ్మధార : ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేపడుతున్నట్లు సహాయ రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆదివారం స్వర్ణ భారతి స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లు, పోలింగ్ తరువాత మెటీరియల్ స్ట్రాంగ్ రూమ్స్‌లో భద్రపరచడం, కౌంటింగ్ ఏర్పాట్లు గురించి అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. అదే విధంగా కౌంటింగ్ సమయంలో ఎన్నికల పరిశీలకులకు, పోటీలో పాల్గొన్న అభ్యర్థులకు, ఏజెంట్లలకు, చేపట్టే సదుపాయాలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. సిసి కెమెరాల ఏర్పాటు, ఎన్నికల సామగ్రి పంపిణీ, కౌంటింగ్ సమయంలో సమాచారం ఏ విధంగా అందించాలి ? అనే విషయంపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, సింహాచలం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి, నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ శ్యామ్ ప్రసాద్, సూపరింటెండెంట్ రామారావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మోటారు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆటో, మోటారు కార్మికులకు భద్రతతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్ డిమాండ్ చేశారు. అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో కాన్వెంట్ జంక్షన్ వెజిటెబుల్ మార్కెట్ ఆటో మోటార్ కార్మికులు, డ్రైవర్స్, ఓనర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలపై నియంత్రణ ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారీగా పెంచిన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, ఎఫ్‌సి పర్మిట్, ఎల్ఎల్ఆర్ చలానా ఛార్జీలను రద్దు చేయాలన్నారు.

పట్టని ఎన్నికల కోడ్..!

యథేచ్ఛగా ఉల్లంఘనలు
పట్టించుకోని ఎన్నికల సంఘం
అంతులేని అధికార దుర్వినియోగం
- తాజాగా సీతమ్మధారలో వాలంటీర్లతో పట్టభద్రులను తీసుకొచ్చి సమావేశం

ప్రజాశక్తి - విశాఖపట్నం

విశాఖలో ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తున్నవారిపై చర్యలు కానరావడం లేదు. అధికార పార్టీ నేతలు, కొంతమంది అధికారులు, వాలంటీర్లు పదేపదే ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. వీటిపై ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక, సిపిఎం, ప్రజా సంఘాలు ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా అతిక్రమించిన వారిపై చర్యలు కానరావడం లేదు.

వాస్తవానికి ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ దుర్వినియోగానికి అడ్డూఅదుపూలేకుండా పోయింది. తమ అధికారాలను అడ్డంపెట్టుకొని అనర్హులను ఓటర్లుగా నమోదుచేసిన దగ్గర నుంచి... ఎన్నికలు సమీపించడంతో ప్రచారం వరకు బరితెగించి వ్యవహరిస్తున్నా ఎన్నికల సంఘంగానీ, ఎన్నికల అధికారులుగానీ కట్టడిచేయడంలేదు. దసపల్లా హోటల్‌లో నిర్వహించిన కెజిబివి ఉద్యోగుల సమావేశంలో వైసిపి అభ్యర్థి సుధాకర్ పాల్గొన్నారు. ఈ వివాదమింకా ముగియకుండానే, ఆంధ్రా యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రసాద్‌రెడ్డి మరోకడుగు ముందుకేసి, ప్రయివేటు డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్లతో ఇదే హోటల్లో సమావేశం నిర్వహించారు. ఉత్తరాంధ్ర వైసిపి సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి, వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబుతో కలిసి కరస్పాండెంట్లతో నిర్వహించిన ఈ సమావేశంలో ఎయు విసి పాల్గొన్నట్లు బయటపడినా, తాను పాల్గొనలేదని బుకాయించి అధికార పార్టీ అండతో తాత్కాలికంగా తప్పించుకోగలిగారు. ఈ వివాదమిలా నడుస్తుండగానే ఆనందపురం, పద్మనాభం మండలాల ఎంఇఒలు వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యాకానుక, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాల వంటి అకడమిక్ అంశాలపై ఉపాధ్యాయులతో సమావేశాల పేరిట అధికార పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా మీటింగ్‌లు పెట్టారు.


Forwarded
వాలింటర్లకు మనవి! రేపు మధ్యాహ్నం 3 గంటలకు సీతమ్మధార రాధాకృష్ణ ఫంక్షన్ హాలులో,మీ యొక్క క్లస్టర్లో వున్న పట్టబద్రుల ఓటర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించడం జరుగుతుంది.ఈయొక్క కార్యక్రమానికి ముఖ్య అతిధిగా టిటిడి చైర్మన్,విశాఖ,అనకాపల్లి,విజయనగరం జిల్లాల YSRCP రీజనల్ కోఆర్డినేటర్ గౌ.శ్రీ వై.వి.సుబ్బారెడ్డి గారు విచ్చేయుచున్నారు.వారేకాకుండా VMRDA చైర్ పర్సన్,విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త గౌ.శ్రీమతి అక్కరమాని విజయనిర్మల గారు,ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పోరేషన్ చైర్మన్,పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్ధి అయినటువంటి గౌ.శ్రీ సీతంరాజు సుధాకర్ గారు విచ్చేయుచున్నారు.కావున ప్రతిఒక్క వాలింటర్ మీ యొక్క ఓటర్లతో టైం తప్పకుండా హాజరు కాగలరని కోరుకుంటూ.....ఇట్లు.. మొల్లి అప్పారావు.
19:13
Message

పట్టభద్రులను సమావేశానికి తీసుకురావాలంటూ వాలంటీర్లకు వాట్సాప్‌లో పంపిన మెసేజ్

సమావేశ వేదికపై సుబ్బారెడ్డి, ఎంపీ ఎంవివి, సుధాకర్ తదితరులు

ఈసారి వాలంటీర్ల సాయంతో..

తాజాగా వాలంటీర్లతో పట్టభద్రులను తీసుకొచ్చి సీతమ్మధారలో సమావేశం నిర్వహించారు. ఆ వివరాల్లోకి వెళితే.. సీతమ్మధారలోని రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో వైసిపి ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ఆదివారం ఆత్మీయ సమావేశం పేరిట ఓ కార్యక్రమం తలపెట్టారు. ప్రతి వాలంటీరు తమ పరిధిలోని పట్టభద్రులను ఈ సమావేశానికి తీసుకురావాలని జివిఎంసి 16వ వార్డు వైసిపి కార్పొరేటర్ మొల్లి అప్పారావు పేరిట వాట్సాప్‌లో మెసేజ్‌లు వెళ్లాయి. ఈ క్రమంలోనే సుమారు 150 మంది వాలంటీర్లు, పట్టభద్రులు ఈ సమావేశానికి హాజరయ్యారు. టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి దీనికి ముఖ్య అతిథిగా హాజరై శాసనమండలి ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి విజయానికి అందరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, వైసిపి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు, విఎంఆర్‌డిఎ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సీతంరాజు సుధాకర్, కెకె.రాజు తదితరులు పాల్గొనారు. వాస్తవానికి ఎన్నికల పనులకు వాలంటీర్లు దూరంగా ఉండాలని ఎన్నికల అధికారి తెలిపినా ఆచరణలో ఆ విధంగా జరగడం లేదు. పింఛన్ల పంపిణీ సమయంలోనూ వారు అధికార పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని పింఛనుదారులపై ఒత్తిడి తెచ్చిన విషయం తెలిసిందే.

ఫిర్యాదుపై స్పందించని కలెక్టర్

వార్డు వాలంటీర్లను ఉపయోగించి పట్టభద్రులతో సమావేశం నిర్వహిస్తున్నారని ఆదివారం ఉదయమే ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జునకు ఫిర్యాదు చేశారు. సమావేశాన్ని అడ్డుకోవాలని కోరారు. అయినప్పటికీ ఆ దిశగా చర్యలు కానరాలేదు.

ప్రజాశక్తి ఆధ్వర్యాన..

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని వెంకోజీపాలెం, అంజయ్యనగర్ ప్రాంతంలోని పదో తరగతి విద్యార్థులకు ప్రజాశక్తి ఆధ్వర్యాన ఆదివారం స్టడీ మెటీరియల్ అందజేశారు. ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ స్టడీ మెటీరియల్‌ను యుటిఎఫ్ రూపొందించింది. కార్యక్రమంలో సిపిఎం ఏరియా నాయకులు కోదండ, చంటి, ప్రజాశక్తి సిబ్బంది పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్‌తో పదో తరగతి విద్యార్థులు

మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత ఓట్ల కోసమే సమ్మిట్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖలో వైసిపి నేతలు చేస్తున్న భూ దందాల నుంచి ప్రజల దృష్టి మరల్చడం కోసం, ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత ఓట్ల కోసం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించారని టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి హయాంలో జరిగిన పెట్టుబడుల ఒప్పందాలను వైసిపి ప్రభుత్వం ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. లూలూ గ్రూప్ టెంపుల్ టన్ కంపెనీలకు చెందిన పారిశ్రామికవేత్తలను వైసిపి బెదిరించి ఇక్కడి నుంచి పంపించేసిందని ఆరోపించారు. సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్లు రావడానికి వచ్చే ప్రభుత్వం టిడిపినేనని పారిశ్రామిక వేత్తలు నమ్మడమే కారణమన్నారు. సమ్మిట్‌లో భోజనాలు దగ్గర తన్నులాట కనిపించిందని, రాష్ట్ర పరువు మంట కలిసిందని తెలిపారు. పరిశ్రమలను ఇక్కడి నుంచి తరిమేసిన వారు పరిశ్రమలు రావాలని కోరడంలోగల ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. అమర్ రాజా సంస్థ పెట్టుబడి పెడతాం అంటే సజ్జల పొమ్మనమని బహిరంగంగానే చెప్పారన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా జిఐఎస్ సమ్మిట్ నిర్వహించారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్.రామకృష్ణ మాట్లాడుతూ విశాఖను పరిపాలనా రాజధానిగా చూపిస్తూ ఇక్కడ భూములను వైసిపి నేతలు దోచుకుంటున్నారన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ వైసిపి పాలనలో ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు ఆవేదన చెందుతున్నారన్నారు.

కోడి వ్యర్థాలు అమ్ముకుంటున్న కార్పొరేటర్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కోడి వ్యర్థాలను సేకరించి చేపల, రొయ్యల చెరువులకు అమ్ముకుంటున్న అధికార పార్టీ కార్పొరేటర్లు, వారికి సహకరిస్తున్న జివిఎంసి అధికారులపై చర్యలు తీసుకోవాలని సమాచార పరిరక్షణ సమితి కన్వీనర్ కొమర కృష్ణ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో అనధికారికంగా అతి ప్రమాదకరమైన కోడి వ్యర్థాల వ్యాపారం యథేచ్ఛగా జరుగుతుందన్నారు. అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్లే అందులో కీలక సూత్రధారులుగా మారి లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ వ్యర్థాలను నగరంలోని అన్ని చికెన్ సెంటర్ల నుంచీ పెద్ద పెద్ద బొలారో వాహనాలలో సేకరించి చేపల చెరువులకు అమ్ముకుంటున్నారని తెలిపారు. ఆరు నెలల్లో పెరగాల్సిన చేపలు, దీనిని తిని నెలా, రెండు నెలల వ్యవధిలో పెరగడంతో పెంపకందారులకు బాగా ఆదాయవనరుగా మారిందన్నారు. కానీ ఆ చేపలు తిన్న ప్రజలు రోగాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారని డాక్టర్లు హెచ్చరిస్తున్నారన్నారు. వాస్తవానికి ఈ వ్యర్థాలను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించడానికి కాంట్రాక్టర్లు ఉన్నప్పటికీ అలా జరగడం లేదన్నారు.

కళాకారుల వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్, విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కళాకారుల మెగా మెడికల్ క్యాంప్ విజయవంతమైంది. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి సుమారు 300 మంది కళాకారులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. నగరానికి చెందిన వైద్యుల పర్యవేక్షణలో సుగర్, బిపి పరీక్షలతో పాటు దంత పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్ వైద్యులు డాక్టర్ కృష్ణ హారిక, డాక్టర్ సాయిలక్ష్మి, డాక్టర్ కృష్ణ కీర్తి, డాక్టర్ ఉమా ప్రవల్లిక హాజరై అవసరమైన పరీక్షలు నిర్వహించి, మందులు, కళ్లద్దాలు ఉచితంగా అందజేశారు. అనంతరం డాక్టర్ శ్రీప్రభ క్యాన్సర్ వ్యాధికిగల పలు అంశాలపై ప్రసంగించారు. స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎం.త్రినాధరావు, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఉషా రాజు, జోనల్ ఛైర్‌పర్సన్ రోహిణి రాజు, క్యాబినెట్ సెక్రటరీ యు.జానకీ దేవి, కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షులు కొణతాల రాజు, అధ్యక్షులు మహ్మద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు పాల్గొన్నారు.